క్లుప్తంగా

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



సోన్ పరీక్ష కేంద్రం వద్ద చీఫ్ సూపరిడెంటెంట్ గజపల్లి నర్సయ్య

కుంటాల/కడెం/లోకేశ్వరం/సారంగపూర్/లక్ష్మణచాంద/సోన్/తానూరు/ముధోల్: జిల్లావ్యాప్తంగా నేటి నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. అన్ని పాఠశాలల కేంద్రాల్లో ఉపాధ్యాయులు ఇప్పటికే హాల్‌టికెట్లు నంబర్లను వేశారు. పరీక్ష ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటుందని చీఫ్ సూపరింటెండెంట్లు, డీవోలు పేర్కొన్నారు. విద్యార్థులు కేంద్రానికి సకాలంలో చేరుకోవాలని సూచించారు. ఆయా కేంద్రాలను ఎంఈవోలు, అధికారులు పరిశీలించారు.

నేరాల నియంత్రణే ధ్యేయం



లాబ్దిలో మాట్లాడుతున్న ఎస్సై గణేశ్

బాసర: నేరాల నియంత్రణే ధ్యేయంగా పోలీసులు పనిచేస్తున్నారని ఎస్సై గణేశ్ తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో బాసర పోలీసు స్టేషన్ పరిధిలోని లాబ్ది గ్రామంలో గురువారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామంలో సరైన ధ్రువపత్రాలు లేని 48 బైక్‌లు, రెండు ఆటోలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైన అపరిచితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

28న దుకాణాలకు వేలం

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ పరిసర అటవీప్రాంతంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలోని దుకాణాలకు ఈనెల 28న వేలం పాట ఉంటుందని ఈవో భూమయ్య పేర్కొన్నారు. కొబ్బరికాయలు, పూజాసామగ్రి తినుబండారాలు విక్రయించేందుకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ.50 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

ఉపాధి కూలీల ధర్నాకు తరలిరావాలి



కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

కడెం: ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఈనెల 24న నిర్వహించే ధర్నాకు తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి నూతన్‌కుమార్ కోరారు. మండలంలోని అంబారిపేట్‌లో గురువారం ఉపాధి పనుల ప్రదేశానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని పెద్దూర్ సమీపంలోని నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు.

22, 23 తేదీల్లో నీటి సరఫరా నిలిపివేత

నిర్మల్‌టౌన్: పట్టణానికి నీటి సరఫరా చేసే మిషన్ భగీరథ మాడేగాం నీటి శుద్ధికరణ కేంద్రంలో పనులు చేపడుతున్నందున ఈనెల 22, 23న నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని పట్టణ ప్రజలు గమనించాలని కోరారు. అదేవిధంగా మున్సిపల్ ఆధ్వర్యంలో సిద్దాపూర్ ఫిల్టర్‌బెడ్ వద్ద పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

న్యూవెల్మల్‌లో గ్రామసభ

సోన్: మండలంలోని న్యూవెల్మల్‌లో ప్రత్యేక అధికారి రాజమల్లు, గ్రామ కార్యదర్శి భూపాల్‌రెడ్డి అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నుంచి రూ.28 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. గ్రామంలో అవసరమున్న చోట డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతామన్నారు. బస్టాండ్ సమీపంలో దుకాణ సముదాయాల భవనాలకు త్వరలో బహిరంగ వేలం ఉంటుందన్నారు. అంగన్‌వాడీ భవన మరమ్మతు పనులు పూర్తి చేయాలని, గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడం లేదని, శ్మశానవాటిక వద్ద ముళ్లపొదలతో అస్తవ్యస్తంగా ఉందని, మిషన్ భగీరథ నీళ్లు సరిగా రావడం లేదని ప్రత్యేక అధికారి దృష్టికి గ్రామస్తులు తీసుకువచ్చారు. అంతకుముందు పారిశుద్ధ్య పనులు, శ్మశాన వాటికను పరిశీలించారు.


తరగతి గదిలో గుట్కా మరకలతో కనిపిస్తున్న పరీక్ష కేంద్రం



తెల్లని గోడలపై ఉమ్మేసిన గుట్కా మరకలు



విద్యార్థులు కూర్చొని పరీక్ష రాసే పక్కనే గుట్కా మరకలు



సినిమా హాల్ కాదు.. తరగతి గదే..

అంది విద్యాబుద్ధులు నేర్చుకునే పాఠశాల. నిత్యం పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఉపాధ్యాయులు పుస్తకాల్లోని పాఠాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత, స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ తదితర అంశాల గురించి నేర్పిస్తారు. చిన్ననాటి నుంచే అవగాహన ఉంటే సమాజంలో మంచి పౌరులుగా ఎదురుగతారు. అయితే నిర్మల్ జిల్లా కేంద్రంలోని కస్బా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో ఇవి మచ్చుకైనా కనిపించడం లేదు. పాఠశాలలోని తరగతి గదులు.. సినిమాళ్ల తరహాలో గోడలపై పాన్‌పరాగ్, గుట్కాలు నమిలి ఉమ్మివేసిన మరకలు దర్శనమిస్తున్నాయి. వాటిని చూస్తేనే వామ్‌టింగ్ వచ్చేలా ఉన్నాయి. ఈ గదుల్లోనే పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. - సాక్షి ఫొటో గ్రాఫర్ నిర్మల్

బోథ్–అడెల్లి రోడ్డు పనులు

పరిశీలించిన మాజీ మంత్రి

- అడెల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు
- నూతన ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



బోథ్–అడెల్లి రహదారి(కండి) పరిశీలిస్తున్న ఇంద్రకరణ్‌రెడ్డి, రాథోడ్ బాపూరావు

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయం మీదుగా ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గానికి వెళ్లేందుకు వీలుగా నిర్మిస్తున్న రహదారి పనులను మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావుతో కలిసి గురువారం పరిశీలించారు. కాంట్రాక్టు సిబ్బంది, అధికారులను రహదారి నిర్మాణానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే (కండి) గుట్టను మధ్యలోంచి చీల్చి వాహనాల రాకపోకలకు వీలుపడేలా చేశామని, ఇంకా కొంత పనులు మిగిలి ఉన్నాయని త్వరలోనే పూర్తి చేస్తామని అక్కడి సిబ్బంది బదులిచ్చారు. మాజీ మంత్రిని ఆయాగ్రామాల్లో రవీంద్రనగర్, నాగాపూర్, తదితర గ్రామాల ప్రజలు సత్కరించారు. అనంతరం అడెల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీమంత్రి, మాజీ ఎమ్మెల్యేలకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అక్కడే నూతనంగా నిర్మించిన అడెల్లి మహాపోచమ్మ ఆలయాన్ని పరిశీలించి ఈవో రమేశ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ అయిర నారాయణరెడ్డి, నాయకులు ఉన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన ఉండాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: రాజకీయపార్టీల ప్రతినిధులందరూ ఎన్నికల సంఘం నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని, ఏజెంట్ల బాధ్యతలు, హక్కులను తెలియజేయాలన్నారు. ఫారం 6, 7, 8 లకి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని ఓటరు జాబితాలో ఉన్న తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఉందన్నారు. ఓటర్లు తమ పేరు, చిరునామా తదితర వివరాలు సవరించుకుకోవాలనుకుంటే తహసీల్దార్, మున్సిపల్, ఆర్డీవో కార్యాలయాల్లో దరఖాస్తులు ఇవ్వవచ్చని తెలిపారు. నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకే ఓటరు ఇతర చోట్ల ఓటు హక్కు ఉన్న, నకిలీ ఓటర్ల ఏరివేత ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు జిల్లా యంత్రాంగం తీసుకునే చర్యల్లో రాజకీయ పార్టీలు సహకరించాలని కోరా రు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రావణ్‌రెడ్డి, రమేశ్, నరేశ్, మజార్, షేక్ హైదర్, అధికారులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడేవారికి గుర్తింపు

- ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్



ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఎమ్మెల్యే

ఖానాపూర్: పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఖానాపూర్ నూతన మార్కెట్‌కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఖానాపూర్ పాలకవర్గం ఎన్నిక విషయంలో ఎవరెన్ని విమర్శలు చేసినా సీనియార్టీ, అభిప్రాయ సేకరణ, కులమతాలకతీతంగా సమన్యాయం చేశామన్నారు. నూతన పాలకవర్గం రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తుందన్నారు. తాను పార్టీలోకి వచ్చిన ఆనతికాలంలో ఎమ్మెల్యే అయ్యానని పేర్కొన్నారు. పార్టీకి వెన్నుపోటు పొడిచే కోవర్టులు స్వచ్ఛందంగా వెళ్లిపోవాలని లేకపోతే పార్టీ క్రమశిక్షణ చర్యలకు బాధ్యులవుతారని అన్నారు. అంతకముందు నూతన చైర్మన్ పడిగెల భూషణ్, వైస్ చైర్మన్ అబ్దుల్ మాజిద్, డైరెక్టర్లు పుల్యానాయక్, నారాయణరెడ్డి, ధాతుర్క గంగాధర్, అశోక్‌రావు, యాదగిరి, తోకల మహేందర్, జలజ, చిన్న రాజన్న, నారాయణ, విఠల్, దయాకర్, శేఖరయ్యలతో జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మండల, పట్టణ అధ్యక్షులు దయానంద్, నిమ్మల రమేశ్, పార్టీ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి

దస్తురాబాద్: గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ, ప్రత్యేక అధికారులతో వేసవి సమ్మర్ ప్లాన్‌పై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డీపీవో మాట్లాడుతూ వేసవిలో నీటి సమస్యలు ఉన్న ప్రాంతాలు గుర్తించాలన్నారు. మిషన్ భగీరథ సిబ్బంది సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నీటి సమస్యపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బస్టాండ్ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అంతకుముందు రేవోజీపేట, బు ట్టాపూర్‌లో పర్యటించి హరిత నర్సరీలు, డంపింగ్ యార్డు, ప్రకృతి వనాలు, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన దివ్యాంగురాలైన కంతి నాగలక్ష్మి గురువారం కడుపునొప్పితో నిర్మల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ఆమెను పరీక్షించి 'ఏ'ప్లస్ రక్తం మూడు యూనిట్లు కావాలని చెప్పారు. విషయం తెలుసుకున్న మండల కేంద్రం మాజీ ఎంపీటీసీ ఓస రాజుతోపాటు అదేగ్రామానికి చెందిన రవీందర్, వడ్యాల్‌కు చెందిన చిన్ను రక్తదానం చేశారు. నాగలక్ష్మికి ఇంకా రక్తం అవసరమని వైద్యులు తెలిపారు. ఎవరైనా దాతలు ఉంటే రక్తదానం చేయాలని కుటుంబీకులు వేడుకున్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

నిర్మల్‌టౌన్: కాంగ్రెస్‌తోనే అ భివృద్ధి సాధ్యమని డీసీసీ అ.ధ్యక్షుడు కూచడి శ్రీహరిరావు అన్నారు. నిర్మల్‌రూరల్ మండలం అక్కాపూర్ గ్రా మంలోని ద్వారకనగర్‌లో రూ.75 లక్షలతో నిర్మించే సీ సీ రోడ్డు నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమారెడ్డి, మాజీ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, ద్వారకనగర్ కాలనీ ప్రెసిడెంట్ రాజన్న, భీమ్‌సింగ్, రాజ లింగం, రామకష్ణ, గబ్బర్‌సింగ్, పోశెట్టి, మౌలానా పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



క్యాంటీన్ నిర్వాహకురాలకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని మహిళా శక్తి క్యాంటీన్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ గురువారం పరిశీలించారు. కలెక్టర్ క్యాంటీన్ నిర్వాహకులతో మాట్లాడారు. వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు, అధికారులకు నాణ్యమైన రుచికరమైన భోజనం, అల్పాహారం అందించాలన్నారు. భోజనం తయారు చేసే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. భోజనానికి నాణ్యమైన సరుకులనే వినియోగించాలని తెలిపారు. అంతకు ముందు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని మహిళాశక్తి క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. చికిత్స కోసం వచ్చే రోగులకు, వారి సహాయకులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ సుభాష్, మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వాహకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

కడెం: వేసవిలో ఆయిల్‌పామ్ సాగులో తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉద్యాన, సెరికల్చర్ అధికారి బీవీ.రమణ అన్నారు. మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్, కల్లెడ గ్రామాల్లో ఆయిల్ పామ్ తోటలను గురువారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఉద్యానశాఖ నుంచి సబ్సిడీపై అందించిన డ్రిప్ ఇరిగేషన్ సిస్టంను పరిశీలించారు. ఆయన వెంట ఖానాపూర్ క్లస్టర్ అధికారిని స్పందన, ప్రియూనిక్, ఫినోలెక్స్ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆయిల్ పామ్ తోటల పరిశీలన

దస్తురాబాద్: భూత్కూర్, రాంపూర్, దస్తురాబాద్ గ్రామాల్లోని ఆయిల్ పామ్ తోటలను గురువారం జిల్లా ఉద్యానవన అధికారి బివి.రమణ పరిశీలించారు. హెచ్‌వో స్పందన, ఫ్రీయూనిక్ క్లస్టర్ అధికారి నవీన్, వెంకట్ తదితరులు ఉన్నారు.

ముగిసిన నామినేషన్ ప్రక్రియ

ఖానాపూర్: పట్టణంలోని బార్ అసోసియేషన్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ గురువారం ముగిసిందని ఎన్నికల అధికారులు, న్యాయవాదులు కామోజీ వేణుగోపాల్, షబ్బీర్ పాషా తెలిపారు. 21న నామినేషన్ల పరిశీలన, 22న ఉపసంహరణ, 27న ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

పెంబి: గ్రామీణ మహిళలు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎఫ్ఆర్వో రమేశ్‌రావ్ సూచించారు. మండల కేంద్రంలో గురువారం అటవీశాఖ–హైటికాస్ ఆధ్వర్యంలో ఆయన మాట్లాడారు. హైటికాస్ ప్రతినిధి వెంకట్, డీఆర్వో ప్రతాప్‌నాయక్, ఎఫ్ఎస్ఓ గీత పాల్గొన్నారు.

ఎల్‌ఓసీలు అందజేత

ముధోల్: మండల కేంద్రానికి చెందిన రజియా బేగాంకు గురువారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి రూ. 2.40 లక్షల ఎల్‌వోసీని అందజేశారు. బాధితురాలు అనారోగ్యంతో ఉండడంతో మాజీ ఎంపీపీ అఫ్రోజ్‌ఖాన్ మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మంత్రి సీతక్క దృష్టికి తీసుకువచ్చి రూ. 2.40 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించి గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

నిర్మల్‌చైన్‌గేట్: మామడ మండలం పోనకల్ గ్రామానికి చెందిన గడ్డంద నర్సయ్యకు రూ.1.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబానికి అందించారు. నాయకులు మంగు లింగన్న, కాలగిరి గంగారెడ్డి, కట్కం సుదర్శన్ ఉన్నారు.

పది విద్యార్థులకు వీడ్కోలు

ముధోల్: స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు అలరించాయి. పదోతరగతి విద్యార్థులు వారి జ్ఞాపకార్థంగా 40 డెస్క్ బెంచీలను పాఠశాలకు విరాళంగా అందజేశారు. హెచ్‌ఎం పార్థసారథి ఉన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

కుంటాల: ఇంటర్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. స్థానిక ఆదర్శ పాఠశాలలో కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు 431 మంది విద్యార్థులకుగాను 414 మంది హాజరు కాగా 17 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరిండెంటెంట్ నవీన్‌కుమార్, డీవో సంతోష్ తెలిపారు. ఎస్సై భాస్కరాచారి ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించారు.

కుభీర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు 123, సెకండియర్ విద్యార్థులు 139 మంది పరీక్ష రాశారు.

చలివేంద్రాలు ప్రారంభం

లక్ష్మణచాంద: మండల కేంద్రంతోపాటు రా చాపూర్ పంచాయతీల ఆధ్వర్యంలో గురువా రం ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎంపీడీవో రాధ ప్రారంభించారు. ఎంపీవో అమీర్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు విక్రమ్‌రాజ్, శైలజ పాల్గొన్నారు.

కుంటాల: కల్లూరులో చలివేంద్రాన్ని డీఎల్పీవో సుదర్శన్ ప్రారంభించారు. కార్యదర్శి భోజన్న ఉన్నారు.

పూర్వ విద్యార్థికి ఆర్థికసాయం

దిలావర్‌పూర్: మండలంలోని సిర్గాపూర్‌కు చెందిన గాండ్ల నర్సయ్య గత ఐదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి ఆయన మంచం పట్టాడు. ఆయనతో కలిసి చదువుకున్న నర్సాపూర్(జి) జెడ్పీహెచ్ఎస్ 1997–98 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు పోగు చేసిన రూ.40వేల నగదును గురువారం అందజేశారు. పూర్వవిద్యార్థులు, నర్సయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

లక్ష్మణచాంద: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు 15వవిడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాధ ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 సంవత్సరంలో జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనుల వివరాలపై ప్రజావేదిక ఉంటుందని పేర్కొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్లకు సన్మానం..

పెంబి: ఖానాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సల్ల స్వప్నిల్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. శంకర్, మోహన్‌రెడ్డి, రమేశ్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం

దిలావర్‌పూర్: సిర్గాపూర్‌లోని ప్లేర్ ఉన్నత పాఠశాలలో నిర్మల్‌కు చెందిన వినయ్ డెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ వినయ్ విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కరస్పాండెంట్ నరసింహారెడ్డి, ప్రిన్సిపాల్ ఉన్నారు.

ఆలయంలో పూజలు

కుంటాల: కల్లూరులో సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు ఉచితనోటి పరీక్షలు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రపంచ నోటి ఆరోగ్యదినం పురస్కరించుకొని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కస్బాలో తెలంగాణ మైనార్టీ స్కూల్ విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. దాదాపు 230 మంది పిల్లలను ఉచితంగా పరీక్షించి మందులు అందజేశారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సెక్రెటరీ డా.వెంకటరమణ, ప్రిన్సిపాల్ సుజాత, స్టాఫ్‌నర్సు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఐని కలిసిన నాయకులు

సోన్: సీఐగా బాధ్యతలు స్వీకరించిన గోవర్ధన్‌రెడ్డిని స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం మండల నాయకులు కలిసి సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచులు వినోద్ కుమార్, లింగన్న, నాయకులు రాజేశ్వర్, నరేశ్, ప్రదీప్, వినోద్, అర్జున్ లింగన్న, దాసరి శ్రీనివాస్ ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



బాసరలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తానూరు: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు పుండలిక్, నాయకులు చంద్రకాంత్ యాదవ్, గోవింద్‌రావ్ పటేల్ తదితరులు ఉన్నారు.

బాసరలో..

బాసర: బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తంచేస్తూ మండలంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కార్యకర్తలు, అభిమానులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు రమేశ్, నరసయ్య, మహమ్మద్ ఫరూక్, సయ్యద్ జలీల్, సంజీవరావు దేశ్ముఖ, దేవేందర్, చిన్నగౌడ్, సాంబన్న, బాలు తదితరులు పాల్గొన్నారు.

కుభీర్‌లో మందకృష్ణ చిత్రపటానికి..

కుభీర్: ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని అన్నాబావు విగ్రహం వద్ద గురువారం మాదిగ సమాజం నాయకులతో కలిసి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు కొత్త శంకర్, జీవన్, కాశీనాథ్ తదతరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి కృషి



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. పట్టణంలోని గురువారం ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు, సిబ్బంది కృషిచేయాలన్నారు. ఆస్పత్రిలో ఎలాంటి మందుల కొరత ఉంటే ముందుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమకూర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వార్డుల్లో, ఓపీ విభాగంలో రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించారు. అంతకుముందు స్థానిక బస్టాండ్ ప్రాంతంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. అక్కడే ఓ హోటల్‌లో చాయ్ తాగుతూ స్థానికులతో ముచ్చటించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ వంశీమాదవ్, నాయకులు దయానంద్, నిమ్మల రమేశ్, చిన్నం సత్యం, అంకం రాజేందర్, వైద్యులు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మొక్కలకు నీరందించాలి

లోకేశ్వరం: నర్సరీలోని మొక్కలకు నీరందించాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. మండలంలోని హవర్గ, మన్మద్ గ్రామాల్లోని సెగ్రిగేషన్ షెడ్, నర్సరీ, వర్మీ కంపోస్టు ఎరువు తయారీని గురువారం పరిశీలించారు. కార్యదర్శులు ప్రతీరోజు నర్సరీలను పర్యవేక్షించాలన్నారు.

తానూరు: నర్సరీ నిర్వహణపై జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో నసిరొద్దీన్ సూచించారు. జౌలా(కే)లో పంచాయతీ, ఈజీఎస్ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీని గురువారం పరిశీలించారు. టీఏ గంగాధర్, సిబ్బంది ఉన్నారు.

కుంటాల: దౌనెల్లి నర్సరీని పంచాయతీ కార్యదర్శి సాయేందర్ గురువారం పరిశీలించారు. వివిధ రకాల మొక్కలతోపా టు అంజీర, దానిమ్మ, నిమ్మ, సీతాఫలం, జామ పండ్ల మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. ఎఫ్ఏ రాథోడ్ నరేందర్ ఉన్నారు.